నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | శుక్రవారం 9 ఆగస్టు 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

తిర్యాణి మండలం గుండాల వాగు దాటుతున్న ఆదివాసులు

అడవిబిడ్డల గోడు పట్టదా..?

- ఆదివాసుల సంక్షేమంపై పట్టింపు కరువు
- నిలిచిన పోడు పట్టాల పంపిణీ
- ఆంగ్ల విద్యకు మంగళం
- 33 గిరిజన గ్రామాల్లో మూతపడనున్న పాఠశాలలు
- రోడ్లు.. వంతెనలు లేక అష్టకష్టాలు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాగులు దాటాల్సిన దుస్థితి
- గర్భిణులకు నరకప్రాయం
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా 'నమస్తే' ప్రత్యేక కథనం

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆగస్టు 8(నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ సర్కారు అడవిబిడ్డల సంక్షేమానికి పెద్దపీట వేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వారి అభివృద్ధి గురించి పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి జీవించే అడవిబిడ్డలకు పట్టాల పంపిణీ నిలిపివేయడం.. దీనికి తోడు గిరిపుత్రులను అడవులకు దూరం చేసే ప్రయత్నాలు చేస్తుండడంతో వారి మనుగడ ప్రశ్నార్థకమవుతున్నది. కేసీఆర్ హయాంలో మన ఊరు-మన బడి ద్వారా ఆంగ్ల విద్యకు శ్రీకారం చుట్టగా, ప్రస్తుతం ఆ పథకం ఊసే ఎత్తడం లేదు. పైగా 33 గ్రామాల్లోని గిరిజన సంక్షేమ పాఠశాలలు మూతబడే పరిస్థితి దాపురించగా, చదువు అందని ద్రాక్షలా మారనున్నది. ఇక అనేక గ్రామాలకు రోడ్లు, వంతెనలు లేక ప్రయాణం నరకప్రాయమవుతున్నది. వైద్యం కోసం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగులు దాటాల్సిన దుస్థితి నెలకొన్నది. నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వారి జీవన స్థితిగతులపై ప్రత్యేక కథనం..

నిలిచిన పోడుపట్టాల పంపిణీ..

దశాబ్దాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఆదివాసీ రైతులకు పట్టాలు పంపిణీ చేసే కార్యక్రమం ఏడాదిగా నిలిచిపోయింది. ఆదివాసీలను అడవులకు దూరం చేసేలా అధికారులు భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. గతేడాది జూన్‌లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 13,177 మంది గిరిజన రైతులకు 51,859 ఎకరాలకు పోడుపట్టాలు అందించారు. ఇంకా జిల్లాలో 25 వేలకు పైగా రైతులకు పోడు పట్టాలు అందించాల్సి ఉంది. 2005లో వచ్చిన అటవీ హక్కుల చట్టం ప్రకారం 2005 కంటే ముందు నుంచి పోడు వ్యవసాయం చేసుకునే గిరిజన రైతులకు హక్కులు కల్పించాల్సి ఉంది.

కెరమెరి మండలం పరుస్ వాడ నుంచి రాళ్ల గుట్టలు దిగుతూ దవాఖానకు వస్తున్న గర్భిణి కల్పన

రాళ్లు రప్పలు దాటి..

కాలినడక కూడా సాధ్యంకాని ఈ దారిలో త న తల్లిదండ్రులతో కలిసి వస్తున్న ఈ గర్భిణి పేరు కల్పన. కెరమెరి మండలం పరస్‌వాడ గ్రామం నుంచి దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరం రాళ్లు.. రప్పలు కలిగిన గుట్టపై నుం చి కేలి(బీ) అనే గ్రామం వరకు నడిచి వచ్చిం ది. అక్కడి నుంచి ఎడ్ల బండిలో కెరమెరి ప్రాథమిక ఆరోగ్యాకేంద్రానికి అతికష్టం మీద చేరుకున్నది. జిల్లాలో ఇలాంటి గిరిజన గ్రామాలు అనేకం ఉన్నాయి. రోడ్లు, వంతెన లు లేకపోవడంతో వర్షాకాలంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగులు.. వంకలు దాటాల్సిన పరిస్థితి వచ్చిందని, ప్రభుత్వం అడవిబిడ్డల గోడు పట్టించుకోదా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పోడు పట్టాల పంపిణీ నిలిచిపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి దాపురించింది.

33 పాఠశాలలు మూత

జిల్లాలో అడవి బిడ్డలు అక్షరాలకు దూరమవుతున్నారు. 33 గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేరనే సాకుతో మూత వేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వం మారుమూల గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో సైతం ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంగ్ల విద్యపై నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. పైగా గిరిజన గ్రామాల్లోని పాఠశాలలే మూతపడే స్థితికి చేరుకుంటున్నాయి. ఆశ్రమ పాఠశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలపై పర్యవేక్షణ లోపించింది. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు నేలమీద కూర్చొని భోజనం చేయాల్సిన పరిస్థితి ఉన్నది.

ఓరియంట్ సిమెంట్ కంపెనీకి 5 స్టార్ రేటింగ్ అవార్డు

న్యూ ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అధికారులు ఎల్లయ్య, ఎన్‌పీ సహారే

- వరుసగా రెండోసారి కైవసం

కాసిపేట, ఆగస్టు 8 : దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ మరో అరుదైన అవార్డును సొంతం చేసుకున్నది. ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ (ఐబీఎం), మినిస్ట్రీ ఆఫ్ మైన్స్ ఆధ్వర్యంలో బుధవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి 2022-23 సంవత్సరానికి అత్యుత్తమ పనితీరు కనబరిచిన గనులకు 5 స్టార్ రేటింగ్ అవార్డులు ప్రదానం చేశారు. దేశంలో ఎఫ్‌వై 2022-23లో 5 స్టార్ రేటింగ్‌ను పొందిన 68 గనులకు అవార్డులు ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 5 గనులు 5 స్టార్ రేటింగ్ సాధించాయి. ఇందులో భాగంగా దేవాపూర్ సున్నపురాయి గని కూడా భాగస్వామ్యం వహించి వరుసగా రెండేళ్లు 5 స్టార్ రేటింగ్ సాధించింది. తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డిప్యూటీ జీ ఎం ఎన్ ఎల్లయ్య, దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ ఎన్‌పీ సహారేలు ఈ అవార్డును అందుకున్నారు.

కోటపల్లి : భారీ వర్షాలకు కొట్టుకుపోయిన ఎదుల్లబంధం గ్రామానికి వెళ్లే రోడ్డు

'దారి'ద్ర్యం

అధ్వానంగా రోడ్లు.. అవస్థల్లో ప్రజలు..

- వర్షాలకు బాహ్య ప్రపంచంతో సంబంధం కోల్పోతున్న పల్లెలు
- వంతెనలు లేక ప్రజల బాధలు వర్ణణాతీతం
- కేసీఆర్ హయాంలో మెరుగుపడిన రవాణా
- కాంగ్రెస్ హయాంలో అటకెక్కిన పీఆర్, ఆర్‌అండ్‌బీ ప్రతిపాదనలు
- రోడ్లు, వంతెనల మరమ్మతుకు నిధులు కరువు
- డబ్బులు మంజూరు కాకపోవడంతో తిప్పలు

మంచిర్యాల, ఆగస్టు 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : భారీ వర్షాలకు ఊరు నుంచి హాస్పిటల్‌కు వెళ్లే మార్గంలోని వాగు రాత్రికి రాత్రే ఉప్పొంగితే.. రేపో.. మాపో.. పండంటి బిడ్డకు జన్మనివ్వాల్సిన నిండు గర్భిణీ మోకాళ్ల లోతు నీటిలో నుంచి వాగులు, వంకలు దాటాల్సిందే. మారుమూల పల్లెలు, గూడేల్లోని పిల్లలు చదువుకోసమని మండల కేంద్రంలోని బడికి వెళ్లి తిరిగి వచ్చేప్పుడు ఏ గతుకుల రోడ్డులోనో.. మట్టి రోడ్డులో ఆటో దిగబడితే తోయాల్సిందే. వాగులు ఉప్పొంగి రోడ్లు కొట్టుకుపోయినా, వంతెనలు ముగినిపోయినా.. కొన్ని గ్రామాల ప్రజలు నేటికీ రోజుల తరబడి బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా బతకాల్సిందే. వర్షాకాలం వచ్చిందంటే చాలు మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఎక్కడ చూసిన కనిపించే దృశ్యాలు.. సరైన రోడ్లు లేక, వాగులు-వంకలపై వంతెనలు లేక మారుమూల గ్రామాలు, ఆదివాసీ పల్లెలు, తండాలు, గూడేల్లోని జనం నరకయాతన అనుభవిస్తున్నారు. ఒకటి, రెండు కాదు వందల సంఖ్యలో పల్లెల్లో ఇదే దుస్థితి. పదేళ్లకు ముందు ఇంతకంటే దారుణంగా ఉన్న పరిస్థితి కేసీఆర్ సర్కార్ పుణ్యమా అని బాగుపడింది. 60 శాతం నుంచి 70 శాతం వరకు మారుమూల ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. వందకు పైగా వాగులు, వంకలపై కేసీఆర్ సర్కార్ వంతెనలు నిర్మించింది. రూ.కోట్లు వెచ్చింది రోడ్లు, అప్రోచ్ రోడ్డు వేసింది. ఇంకా పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల శాఖ నుంచి నిధులు మంజూరు చేసింది. కొన్ని పనులు పురోగతి దశలో ఉండగా, మరికొన్ని టెండర్ల దశకు చేరుకున్న సమయంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఆ పనులను పట్టించుకోలేదు. రీ టెండర్ పేరిట ఆపేసింది. పురోగతిలో ఉన్న పనులకు నిధులు ఆగిపోయాయి. అటవీ శాఖ అనుమతులు లేక మరికొన్ని పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. సర్కారు నిర్లక్ష్యంతో సరైన రవాణా సదుపాయాలు లేక ప్రజలు అరిగోస పడుతున్నారు. అందుకు అద్దం పట్టే ఘటనలు, ఫొటోలు, వివరాలు ఇలా.. వీటితోనైనా కాంగ్రెస్ సర్కారు స్పందించి, ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

కోటపల్లి : రాజారం వాగుపై ధ్వంసమైన చిన్నవాగు లో లెవల్ వంతెన

కోటపల్లి మండలంలోని రాజారం గ్రామ పంచాయతీలో 1125 మంది జనాభా ఉండగా, 844 మంది ఓటర్లు ఉన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఈ గ్రామాలకు రోడ్డు నిర్మాణానికి రూ. 2.30 కోట్లు, పారుపల్లి నుండి కావరకొత్తపల్లి రోడ్డు నిర్మాణానికి రూ.3.30 కోట్లు మంజూరు చేయగా.. అటవీ శాఖ అనుమతులు లేని కారణంగా పూర్తి కాలేదు. అటవీ అనుమతికి మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వివేషంగా కృషి చేసినా అనుమతులు రాలేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఈ గ్రామానికి ఉన్న రెండు దారులలో ఒక దారి మూసుకుపోయింది. మరొక దారి బురదమయం కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కెరమెరి మండలం లక్ష్మాపూర్ వాగు దాటుతున్న గిరిజనులు

ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని అనార్‌పల్లి వాగుపై వంతెన నిర్మాణం పిల్లర్లకే పరిమితం కావడంతో గోండుగూడ, అనంద్‌గూడ, బోరిలాల్‌గూడ, జన్కాపూర్, కరంజివాడ గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెలు, గూడేలకు రవాణా సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని నడుములోతు నీళ్లలో వాగు దాటుతున్నారు. శుక్రవారం బెజ్జూర్ మండంలోని తాలయి గ్రామానికి చెందిన గర్భిణులు లంగారి లావణ్య, లంగారి మేఘనలకు 9 నెలలు నిండడంతో తలాయివాగుపై నాటు పడవలో బెజ్జూరు మండలం కేంద్రానికి తరలించారు. వాగుపై వంతెన లేక ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అత్యవసర సమయాల్లో నాటు పడవల్లో ప్రయాణాలు చేయాల్సి వస్తోంది.

కోణంపేటకు వెళ్లే దారిలో నిర్మించిన బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

నెన్నెల మండలంలో మారుమూల అటవీ గ్రామాలైన కోణంపేట, మన్నెగూడెం, దమ్మిరెడ్డిపేట, లంబడితండా, జంగాల్‌పేట గ్రామాలకు రోడ్డు సౌకర్యంలేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లంబాడితండా ఎర్రవాగుపై వంతెన లేక చిన్నపాటి వర్షానికే ఉప్పొంగే వాగును దాటేందుకు విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణీకులు గంటల తరడి వేచి చూడాల్సి వస్తోంది. ఏడాది కిందట బీఆర్ఎస్ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.2 కోట్లతో టెండర్ పిలిచింది. కానీ.. ఎన్నికల తర్వాత దానిని రీ టెండర్ పేరిట నిలిపేశారు. ప్రస్తుతం లో కాజ్‌వే కల్వర్టుపై ఉన్న సిమెంట్ వరద ఉధృతికి కొట్టుకుపోయింది. మన్నెగూడెం నుంచి కోణంపేట గ్రామానికి ఆరు కిలోమీటర్ల రోడ్డుకు రూ.3 కోట్లు మంజూరు చేసినా అటవీ అనుమతులు లేక రోడ్డు పనులు నిలిచిపోయాయి. కోణంపేట నుంచి అటు కుశ్నపల్లికి వెళ్లేందుకు రూ.3.50 కోట్లతో మూడు వంతెనలు నిర్మించారు. కానీ వంతెనలకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు లేక కాలినడకన వెళ్లాల్సి వస్తున్నది.

ఆసిఫాబాద్ జిల్లాకేందానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండివాగుపై అర్ధాంతరంగా నిలిచిన వంతెన నిర్మాణం

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండివంతెన నిర్మాణానికి రూ.5 కోట్లతో రీ-ఎస్టిమేట్ చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఇన్ని నెలలు అవుతున్నా పనులు ప్రారంభించలేదు. దీంతో గుండి గ్రామంతోపాటు భీంపూర్, కన్నెరగాం, దుబ్బగూడా గ్రామాల ప్రజలు వాగు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని మారుమూల మండలాలైన తిర్యాని, లింగాపూర్ మండలాల్లో పరిస్థితి దయనీయం. చింతలమానెపల్లి మండలంలోని బాబాసాగర్- నాయికపుగూడా, కేతిని-దిందా, రణవెల్లి- టేకం గూడా వాగులపై వంతెనలు నిర్మించాల్సి ఉంది. బెజ్జూర్ మండలంలోని తాలాయి, తిక్కల్లి, బీమారం వాగులపై, దహెగాం మండలంలోని మెర్లిగూడా, కొత్మీర్-దుబ్బగూడా వాగులపై, దహెగాం- కల్వాడ వాగుపై వంతెనలు లేకపోవడంతో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.

గుంతలమయంగా మారిన నీల్వాయి వంతెన అప్రోచ్‌రోడ్డు

మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలోని కోటపల్లి మండలంలో గల ఎదుల్లబంధం గ్రామానికి వెళ్లే దారిలోని తుంతుంగ వాగు ప్రవాహం పెరిగి ఎదుల్లబంధం, సిర్సా, పుల్లగామ, రొయ్యలపల్లి, ఆలుగామ, జనగామ, శివరాంపల్లి, కొత్త సూపాక, వెంచపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. 2020 సంవత్సరంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తుంతుంగ వాగుపై రూ.8 కోట్లతో బ్రిడ్జి నిర్మించారు. పారుపల్లి నుంచి ఎదుల్లబంధం మధ్యలో రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఎదుల్లబంధం గ్రామం సమీపంలోని రోడ్డు కోతకు గురయ్యే అవకాశం ఉందని ఈ ప్రాంత నాయకులు ప్రస్తుత ఎమ్మెల్యే వివేక్ దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదు. దీంతో రోడ్డు తెగిపోయి ఈ గ్రామాలకు వాహనాలు వెళ్లే పరిస్థితి లేక ప్రస్తుతానికి ఈ గ్రామాలకు బాహ్యప్రపంచంతో సంబంధం తెగిపోయింది. మరోవైపు బీఆర్ఎస్ హయాంలో పారుపల్లి గ్రామ సమీపంలో నిర్మించిన బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డు నిర్మించలేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ఎమ్మెల్యే వివేక్ దృష్టి పెట్టి ఈ రోడ్డును పూర్తి చేయించాలని ఆయా గ్రామాలవాసులు కోరుతున్నారు.

వేమనపల్లి మండల కేంద్రం నుంచి ఇటు బెల్లంపల్లి, అటు చెన్నూర్ నియోజకవర్గాలకు వెళ్లేందుకు సరైన రోడ్లు లేవు. వేమనపల్లి నుంచి కల్లెంపల్లి వరకు బీటీ రోడ్డు, వంతెనలు ఉన్నప్పటికీ దిగువనున్న ప్రాణహిత నదీ ఉప్పొంగి వరద ప్రవాహానికి సంపు టం, జాజులపేట, ముక్కిడిగూడం, కల్లెంపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. 2018 లో నీల్వాయివాగుపై రూ.8 కోట్లతో బీఆర్ఎస్ ప్రభుత్వం హై లెవెల్ వంతెన నిర్మించింది. ఇక్కడ అప్రోచ్ రోడ్డు కావాల్సి ఉంది. బుయ్యారం బీటీ రోడ్డుకు రూ.14 లక్షల నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించినా అటవీ అనుమతులు లేక పనులు ఆగిపోయాయి. ప్రస్తుత వర్షాలకు నాలుగు కిలోమీటర్ల రోడ్డు బురదమయంగా మారి జిల్లెడ, బుయ్యారం, సూరారం, లక్ష్మీపూర్, చామనపల్లి, నాగారం గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావడానికే నానా అవస్థలు పడాల్సి వస్తున్నది.

కోటపల్లి మండలం నక్కలపల్లి గ్రామం నుంచి తొర్రె దాటిస్తూ గర్భిణిని తీసుకువస్తున్న 108 సిబ్బంది, గ్రామస్తులు(ఫైల్)

కోటపల్లి మండలంలోని నక్కలపల్లి, బ్రాహ్మణపల్లి.. వేమనపల్లి మండలంలోని చామనపల్లి, బమ్మెన, బద్దంపల్లి గ్రామాల ప్రజలను లోతొర్రె కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ గ్రామాలకు వెళ్లేదారిలో ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి కేసీఆర్ సర్కారు రూ.2.75 కోట్లు మంజూరు చేసింది. ఫారెస్ట్ క్లియరెన్స్ లేక పనులు ఆగాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులో నిర్మించిన లోలెవల్ వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు కష్టంగా మారాయి.

మోకాళ్ల లోతు నీటిలో గర్భిణి అవస్థలు

పోలీసులు, వైద్య సిబ్బంది సాయంతో మోకాళ్ల లోతు నీటిలో మునిగిన అట్టలొర్రె వంతెనను దాటుకుంటూ వస్తున్న గర్భిణి మానేపల్లి లలిత

మాది మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలోని జాజుల పేట. ఈనెలలో డెలివరీకి టైం ఇచ్చారు. భారీ వర్షాలకు ప్రాణహిత నదీ ఉప్పొంగి సంపుటం అట్టలొర్రె వంతెన మీద నుంచి నీరు ప్రవహిస్తూ మా ఊరుకు రాకపోకలు నిలిచాయి. ముందు జాగ్రత్తగా వైద్య సిబ్బంది చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చారు. గత నెల 25వ తేదీన దవాఖానకు వచ్చేప్పుడే నీట మునిగిన అట్టలొర్రె వంతెనను మోకాళ్ల లోతు వరదలో పోలీసులు, వైద్యుల సహాయంతో ఇబ్బంది పడుతూ దాటిన. డెలివరీకి సమయం ఉంది. ఈ నాలుగు రోజులు అమ్మ- అత్తమ్మ దగ్గర ఉంటే బాగుంటుందనుకున్న. కానీ.. ఉన్నఫలంగా తీసుకొచ్చి హాస్పిటల్‌లో చేర్పించడం బాధగా ఉంది. కాకపోతే వరద తీవ్రత ఇంకా పెరిగి మా ఊరిలో ఉన్నప్పుడే నొప్పులు వచ్చి ఉంటే నాతోపాటు నా బిడ్డను కూడా ఇబ్బంది పెట్టిన దాన్ని అవుత. గతంలో ఓ కాన్పులో ఆడబిడ్డ పుట్టి చనిపోయింది. అమ్మ, అత్తమ్మ దగ్గర లేకపోతిని అనే బాధ ఉన్నా.. అన్ని ఆలోచిస్తే హాస్పిటల్‌కు వచ్చే మంచి పని చేసిన అనిపిస్తుంది. వరదలు వచ్చినప్పుడు ఇబ్బందులు కాకుండా మా ఊరుకు హై లెవల్ వంతెన కడితే బాగుంటుంది.

- మానిపెల్లి లలిత

పాత కార్యాలయమే తిరిగి ప్రారంభం

నూతన భవనం పేరిట ఓపెనింగ్ చేసిన ఎమ్మెల్యే పీఎస్సార్

మంచిర్యాల, ఆగస్టు 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంచిర్యాల మార్కెట్ కమిటీ యార్డులను జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాల కోసం కేటాయించారు. ఈ క్రమంలో రైతు బజారు కోసం నిర్మించిన గదులను మార్కెట్ కమిటీ కోసం ఉపయోగించారు. షెటర్ రూమ్‌లు కావడం, కాస్త ఇబ్బందిగా ఉండడంతో ఆదిత్యా ఎన్‌క్లేవ్ కాలనీలోని ఒక అపార్ట్‌మెంట్‌లోకి మార్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాంనగర్ సబ్‌స్టేషన్ దగ్గర కొత్త మార్కెట్ కమిటీ భవనానికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తామంటూ ఆర్భాటం చేశారు. చివరకు బీఆర్ఎస్ హయాంలో మార్కెట్ కమిటీ ఆవరణలోని రైతు బజారు షెటర్ రూమ్‌లలోనే గురువారం పీఎస్సార్ తిరిగి ప్రారంభించారు. గత ప్రభుత్వం చేసిన పనులను తిరిగి ప్రారంభిస్తూ హంగూ ఆర్భాటం చేయగా, ఇదేం కర్మరా బాబు.. అని పలువురు మాట్లాడుకోవడం కనిపించింది. ఇప్పుడున్న ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఏమైనా కొత్త పనులను చేపట్టాలి కాని, పాత పనులను, పాత బిల్డింగ్‌లను తిరిగి ప్రారంభించి కొత్తగా చేసినట్లు చెప్పుకోవడమేమిటని జనాలు గుసగుసలాడుకున్నారు.

రైతు బజారు షట్టర్ రూమ్‌లలో మార్కెట్ కమిటీ భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పీఎస్సార్

పల్లెలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 8 : పల్లెల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం బూరుగూడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలసి మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఇంటింటా సర్వే చేసి జ్వరపీడితులను గుర్తించాలని, వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వీధి కుక్కల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పశువైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడుతూ మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కూలీ పనులు చేసి మూడు నెలలవుతున్నా డబ్బులు రాలేదని కూలీలు కలెక్టర్ దృష్టికి తీసుకరాగా, పీడీతో మాట్లాడి మూడు రోజుల్లో అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ ప్రాజెక్టు అధికారి దత్తారం, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీలత పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న కలెక్టర్